
ప్రజాశక్తి
శనివారం 22 జూన్ 2024 5 విజయనగరం



జాబ్‌మేళాలో 30 మంది ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో స్థానిక ఎంఆర్ కళాశాలలో శుక్రవారం జరిగిన జాబ్‌మేళాకు 67 మంది హాజరయ్యారు. అపోలో టైర్స్, మోడలేజ్ ఇండియా ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్, పాపులర్ షఉమార్ట్ సంస్థలు ఈ జాబ్‌మేళాకు హాజరై, తదుపరి దశకు మొత్తం 30 మందిని ఎంపిక చేశాయి. జిల్లా ఉపాధి అధికారిణి డి.అరుణ, ఆయా కంపెనీల హెచ్‌ఆర్‌లు జి.బాలకష్ణ, వై.శ్రీకాంత్, ఎం.శివకుమార్, యంగ్ ప్రొఫెషన్ ఎం.యశ్వంత్, ఉపాధి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కొండపల్లి శ్రీనివాస్ (గజపతినగరం)



కిమిడి కళావెంకటరావు(చీపురుపల్లి)



బేబినాయన (బొబ్బిలి)



కోండ్రు మురళీమోహన్(రాజాం)



లోకం నాగమాధవి (నెల్లిమర్ల)



పూసపాటి అదితి గజపతిరాజు (విజయనగరం)



కోళ్ల లలితకుమారి (శృంగవరపుకోట)

ప్రమాణ స్వీకారం చేసిన జిల్లా ఎమ్మెల్యేలు

జిల్లాకు చెందిన శాసన సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం అమరావతిలో శుక్రవారం జరిగింది. శాసనసభలో ప్రోటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్యచౌదరి వీరితో ప్రమాణం చేయించారు. జిల్లాకు సంబంధించి మంత్రి హోదాలో రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ ముందుగా శాసన సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం అక్షరమాల ప్రకారం పేర్లను పిలవగా, మహిళా ఎమ్మెల్యేలు విజయనగరం ఎంఎల్ఎ అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఎస్.కోట ఎంఎల్ఎ కోళ్ల లలిత కుమారి, నెల్లిమర్ల ఎంఎల్ఎ లోకం నాగమాధవి ప్రమాణం చేశారు. తరువాత రాజాం ఎంఎల్ఎ కోండ్రు మురళీమోహన్, చీపురుపల్లి ఎంఎల్ఎ కిమిడి కళావెంకటరావు, బొబ్బిలి ఎంఎల్ఎ ఆర్ఎస్ఎస్‌వికె రంగారావు (బేబినాయన) ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లాకు చెందిన శాసనసభ్యులంతా తెలుగులో ప్రమాణ స్వీకారం చేయగా, ఒక్క అదితి విజయలక్ష్మి మాత్రం ఆంగ్లంలో ప్రమాణం చేశారు.

– ప్రజాశక్తి, విజయనగరం

ఎండల్లా మండిపోతున్నాయి



కూరగాయల ధరలు ఎండలు కంటే దారుణంగా మండిపోతున్నాయి. టమోట ధరలు గత ఆరు నెలల్లో ఇంత ఎక్కువ పెరగడం ఎప్పుడూ చూడలేదు. రైతు బజార్‌లో దొరికితే పరవాలేదు. ఇదే బయట కొనుకుంటే కేజీ 80 నుంచి 90 రూపాయల వరకు ఉంది. దీనికి తోడు ఉల్లిపాయలు, కాయగూరల ధరలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. అల్లం, వెల్లుల్లి ధరలు ఇక్క చెప్పక్కర్లేదు. ప్రభుత్వం గతంలో మాదిరిగా ఏదైనా సబ్సిడీ రూపంలో విక్రయిస్తే బాగున్ను.

- ఎన్ని నాగమణి, విటి అగ్రహారం



వంటింట్లో కూరల మంట

- ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలు
- ఠారెక్కిస్తున్న టమాటా

ప్రజాశక్తి-విజయనగరం కోట

కూరగాయల ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. రూ.500 పెట్టినా వారానికి సరిపడా కూరగాయలు రావడం లేదు. ముఖ్యంగా టమాటా, పచ్చిమిర్చి, వెల్లుల్లి, కొన్ని రకాల కూరగాయల ధరలు భారీగా పెరిగిపోయాయి. ఇప్పటికే ఇంటి అద్దెలు, కరెంట్ బిల్లులతో ఇబ్బంది పడుతున్న ప్రజలు కూరగాయల రేట్లు పెరగడంతో మరింత ఇక్కట్లు పడుతున్నారు. చాలా మంది కేజీ కొనేవారు.. అరకేజీ కొంటున్నారు. అరకేజీ కొనేవారు పావుకేజీ కొంటున్నారు. విరివిగా వాడే టమాటా ధరలు అమాంతం పెరగడంతో సామాన్యులు లబోదిబోమంటున్నారు. మొన్నటి వరకు కిలో రూ.30 నుంచి రూ.40 పలికిన టమాటా ఇప్పుడు ఏకంగా కిలోకు రూ.80 అయింది. రైతు బజారులో దీని ధర కేజీ రూ.70 ఉంది. మొన్నటివరకు ఉల్లిపాయలు కేజీ 55 ఉండగా, తాజాగా బయట మార్కెట్‌లో రూ.45, రైతు బజారులో రూ.37 ఉంది. ఉల్లిపాయలు కేజీ 15 నుంచి 20 రూపాయల వరకు ఉండేవి, ఇప్పుడు అవి కేజీ రైతు బజార్లో రూ.37 అవ్వడంతో బయట మార్కెట్‌లో రూ.45 నుంచి రూ.50 మధ్య అమ్ముతున్నారు. టమాటా రైతు బజార్‌లో కేజీ 70 ఉంటే బయట మార్కెట్‌లో రూ.80పైగా అమ్ముతున్నారు. కాయగూరలు వంకాయి, చిక్కుడు, బెండ, దొండకాయలు ఇలా అన్నింటి ధరలూ రూ.40పైనే ఉన్నాయి. వర్షాభావంతో కాయ గూరల పంటలు సాగవ్వకపోవడంతో ఉత్పత్తి తగ్గి ధరలు పెరిగాయని అధికారులు చెబుతున్నారు.

ఆకుకూరల ధరలు కూడా బాగా పెరిగిపోయాయి. పాలకూర, తోటకూర, గోంగూర, పొన్నగంటికూర, బచ్చల కూర, మెంతికూర, కొత్తిమీర, ధరలు భారీగా పెరిగాయి. బీరకాయలు, వంకాయలు, గోరు చిక్కుడు, దొండకాయలు అన్నింటి ధరలూ అదేవిధంగా ఉన్నాయి. మరోవైపు కోడికూర, కోడి గుడ్డు ధరలు కూడా అధికంగానే ఉన్నాయి. కిలో చికెన్ రూ.250 ఉండగా కోడి గుడ్డు ఒక్కటి రూ.6 నుంచి రూ.7 ఉంది.



రైతుబజారులో కూరగాయలు కొంటున్న వినియోగదారులు

వారం రోజుల్లో సబ్సిడీపై టమాటా సరఫరా



అన్ సీజన్‌లో మూడు నెలల పాటు కూరగాయలు, ఉల్లిపాయలు, టమోటో పంటల సాగు సాధారణంగా ఉంటుంది. అందువల్ల కొరత ఏర్పడుతోంది. ప్రస్తుతం టమాట స్థానికంగా సాగవ్వకపోవడంతో చిత్తూరు జిల్లా మదనపల్లి, కర్ణాటక రాష్ట్రం బెంగళూరు ప్రాంతం పోలార్ పరిసర ప్రాంతాల నుంచి టమాటాను దిగుబడి చేసుకుంటున్నాం. ఇవి అక్కడే కేజీ 55 రూపాయల నుంచి 56 వేల రూపాయల వరకు ఉంటుంది వీటిని అక్కడ కొనుగోలు చేసి అంతే ధరకు వినియోగదారులపై భారం పడకుండా విక్రయిస్తున్నాం. వారం పది రోజుల్లో సబ్సిడీపై టమోటాను ప్రభుత్వం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి అమ్మకాలు చేపట్టడానికి చర్యలు తీసుకుంటుంది. ప్రస్తుతం ఉల్లిపాయలు మన ప్రాంతంలో లేకపోవడంతో మహారాష్ట్ర నుంచి పాత ఉల్లి తెప్పించి 32 నుంచి 35 రూపాయలకు అమ్ముతున్నాం. మన రాష్ట్రంలో కర్నూల్ మార్కెట్‌కు కొత్త ఉల్లి వచ్చేవరకు ధరలు ఇలాగే ఉంటాయి.

- రవికిరణ్, అసిస్టెంట్ డైరెక్టర్, రైతు బజార్లు

కూరగాయలు రకం	కేజి ధర
వంకాయలు (తెలుపు)	45.00
వంకాయలు (రవివంగ)	33.00
వంకాయలు (నల్లవంగ)	33.00
టమాట (దేశవాలి)	70.00
బెండకాయలు	44/50
కాకరకాయలు	40.00
బీరకాయలు	45.00
క్యాబేజి	32.00
పొడుగు చిక్కుడు/బర్బాటి	60.00
క్యారెట్	33.00
దొండకాయలు	40.00
బీట్ రూట్	36.00
ఉల్లిపాయలు	37.00
బంగాళదుంపలు	34.00
అల్లం	185.00
పచ్చిమిర్చి	50/60
వెల్లుల్లి	200.00
గోరుచిక్కుడు	50.00
కేప్సికం	96.00
కీరదోసకాయలు	40.00
కందదుంపలు	70.00
చామదుంపలు	50.00
ఫ్రెంచ్ బీన్స్	85/110
పొటల్స్	45.00
ఆగాకర	100.00
ముల్లంగి దుంప	30.00

నగరంలోని మూడు రైతుబజార్లలో శనివారం నుంచి కిలో టమాట రూ.60, ఉల్లిపాయలు, బంగాళదుంపలు రూ.30 చొప్పన విక్రయించనున్నట్లు జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. ఈమేరకు నగరంలోని హోల్‌సేల్ వర్తకులతో శుక్రవారం సమావేశమయ్యారు.



దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్

జిందాల్ కార్మికుల దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-కొత్తవలస

జిందాల్ పరిశ్రమ లాకౌట్‌ను వెంటనే ఎత్తివేయాలని కోరుతూ జిందాల్ ఎంప్లాయీస్, కాంట్రాక్టు వర్కర్స్ జెఎసి ఆధ్వర్యాన శుక్రవారం ఆ పరిశ్రమ వద్ద రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ జిందాల్ యాజమాన్యం లాకౌట్ పేరుతో కార్మికులను బయటకు నెట్టేసిందని ఆగ్రహం వ్యకంచేశారు. 36 రోజులుగా కార్మికులు నిరసన చేపడుతున్నా కనీసం స్పందించలేదని మండిపడ్డారు. జిందాల్ కర్మాగారంలో కార్మిక సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు రిలే నిరాహార దీక్షలు చేపడుతామని స్పష్టంచేశారు. జెఎసి నాయకత్వంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికులకు అండగా తామంతా ఉన్నామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. జిందాల్ జెఎసి నాయకులు నెక్కల నాయుడుబాబు, కోన దేవుడు, సింగంపల్లి గణేష్, బి.సురేష్ (సిఐటియు) నాయకత్వంలో దీక్షలు ప్రారంభించారు. ఈ దీక్షల్లో పిల్లా అప్పలరాజు, భూసాల అప్పారావు (టిఎన్‌టియుసి), నమ్మి చినబాబు, బాలిబోయిన ఈశ్వరరావు (సిఐటియు), సింగంపల్లి ఎర్ణయుడు, జొన్నల రామునాయుడు, కె.అప్పారావు, రామేల అచ్చిబాబు, జెవిఆర్ రాజు, ఇందిర అమ్మాజీ, బండారు రామలక్ష్మి కూర్చున్నారు.

కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలి

- సంక్రాంతి కానుక రూ.వెయ్యి కౌన్సిల్ ఎజెండాలో పెట్టాలి
- కమిషనర్‌కు సిఐటియు వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అప్కాస్‌లో లేని కార్మికులను అప్కాస్ లో చేర్పించాలని, సంక్రాంతి కానుక రూ.1000 కౌన్సిల్ సమావేశం ఎజెండాలో పెట్టి ఆమోదించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్ కోరారు. శుక్రవారం కార్మికులతో కలిసి నగర పాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ థర్డ్ పార్టీ విధానం నుంచి అప్కాస్ విధానం లోకి గత ప్రభుత్వం తీసుకొచ్చిందని, అప్కాస్ లో ఉన్న కార్మికులకు ,థర్డ్ పార్టీ కార్మికులకు వేతనాల్లో వ్యత్యాసం ఉందని తెలిపారు. నగర పాలక సంస్థ లో పని చేస్తున్న వారిలో మరో 144 మంది కార్మికులు థర్డ్ పార్టీ లో ఉండి నలిగిపోతున్నారన్నారు. వెంటనే వీరిని కూడా అప్కాస్ లో చేర్చాలని కోరారు. సంక్రాంతి కానుక రూ.1000 అన్నీ నగరపాలక, మున్సిపాలిటీలో ఇచ్చినప్పటికీ విజయనగరంలో ఇవ్వలేదన్నారు. శనివారం జరిగే కౌన్సిల్ సమావేశంలో ఎజెండా పెట్టి ఆమోదించి డబ్బులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ నీ కోరారు. విలీన ప్రాంత కార్మికుల వేతనాలు బకాయిలు చెల్లించాలని కోరారు. వినతినిచ్చినవారిలో ఎస్.నారాయణరావు, కె.సతీష్, ఎస్.రామినాయుడు కార్మికులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతి అందిస్తున్న సిఐటియు నాయకులు

మరింత చేరువగా పోస్టాఫీసు సేవలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

పోస్టాఫీసు ద్వారా అందిస్తున్న పొదుపు, బీమా, ఐపిపిబి తదితర సేవలు ప్రజలకు మరింత చేరువ చేయాలని విజయనగరం డివిజన్ పోస్టల్ సూపరింటిండెంట్ కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక కంటోన్మెంట్ పోస్టాఫీసులో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన పోస్టల్ మెగా డే సందర్భంగా, వివిధ పథకాలు, సేవలపై ఆయన సమీక్షించారు. పోస్టల్ శాఖ అందిస్తున్న సేవలు, పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు సిబ్బంది అంతా కృషి చేయాలని కోరారు. ఐపిపిబి మేనేజర్ సతీష్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రజలకు ప్రీమియం అకౌంట్స్, ప్రమాద బీమా గురించి వివరించి, ఈ పథకాలను వినియోగించుకొనేలా చైతన్య పరచాలని సూచించారు. గత ఆర్థిక సంవత్సరంలో పొదుపు, బీమా, ఐపిపిబి విభాగాలలో ఉత్తమ ప్రతిభ చూపిన సిబ్బందికి ఈ సందర్భంగా బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కంటోన్మెంటు శాఖ పోస్టుమాస్టర్ శంకర్‌నాయుడు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐటిఐ ఆర్‌డిడి రమణ

సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు అధికంగా లభిస్తాయని ఐటిఐ ఆర్‌డిడి ఆర్ఎ రమణ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటిఐలో శుక్రవారం ఫ్యాషన్ టెక్నాలజీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సాంకేతికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఐటిఐ పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు అధికంగా ఉంటాయన్నారు. విద్యార్థులను సాంకేతికంగా అభివృద్ధి చేసేందుకు ఐటిఐ, స్కిల్ డెవలప్మెంట్ కోర్సులు, ఫ్యాషన్ టెక్నాలజీ ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. డ్రోన్ టెక్నాలజీ ఐటిఐలో ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రంలో 10 కళాశాలల్లో డ్రోన్ టెక్నాలజీ కోర్సు అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. సాంకేతిక విద్య వైపు విద్యార్థులు మొగ్గు చూపాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమణరావు, రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు, క్లబ్ ఫౌండర్ చైర్ గెంబలి శ్రీనివాసరావు, కార్యదర్శి వారాణసి శ్రీహరి, కోశాధికారి ఎస్.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఐటిఐ ఆర్‌డిడి రమణ

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు ఐటిఐ ఆర్‌డిడి ఆర్ఎ రమణ తెలిపారు. ప్రభుత్వ ఐటిఐలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు సాంకేతిక నైపుణ్యం పెంచేందుకు విశాఖ రీజియన్‌లో బొబ్బిలి, రాజాం, విశాఖ ఓల్డ్ ఐటిఐలో ఫ్యాషన్ టెక్నాలజీ ప్రారంభించినట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 ప్రభుత్వ ఐటిఐలలో ఫ్యాషన్ టెక్నాలజీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఒక్కొక్క ఐటిఐకి రూ.2కోట్లు వరకు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఐటిఐలో ఉన్న ట్రేడ్‌ను ఒక పరిశ్రమకు అనుసంధానం చేస్తామన్నారు. పరిశ్రమలకు అవసరమయ్యే నైపుణ్యాలను నేర్పిస్తామని తెలిపారు. విశాఖ రీజియన్‌లో 17 ఐటిఐలో 2 వేల మంది విద్యను అభ్యసిస్తున్నారని చెప్పారు. ప్రయివేట్ ఐటిఐలు 104 ఉన్నాయని, వీటిలో 10 వేల మంది వరకు విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు.

అందని ఎన్నికల పారితోషికం

- నిర్లక్ష్యంగా తహశీల్దార్ సమాధానం
- రెవెన్యూ సిబ్బంది నిరసన

ప్రజాశక్తి-చీపురుపల్లి

'ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి ఖాళీ లేకుండా విధులు నిర్వహిస్తున్నాం. మాకు ఇప్పటి వరకు పైసా కూడా ఇవ్వలేదు. మాకు రావాల్సిన డబ్బులు అడుగుతుంటే.. 'మీ అదృష్టం బాగుంటే వచ్చే తహశీల్దార్ ఇస్తారు. లేదంటే నేనేం చేయలేను' అని ఎన్నికల విధులకు వచ్చిన తహశీల్దారు అంటున్నారు. ఇంతకీ మేమేం చేయాలి.? ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన మాపై ఎందుకింత వివక్ష.'

- ఇదీ మండలంలోని విఆర్‌ఒలు, విఆర్‌ఎలు, బిఎల్‌ఒ ఆవేదన.

చీపురుపల్లి తహశీల్దారు కార్యాలయంలో పనిచేస్తున్న విఆర్‌ఒలు, విఆర్‌ఎలు, బిఎల్‌ఒలతోపాటు రెవెన్యూ సిబ్బంది.. శుక్రవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. తమకు రావాల్సిన ఎన్నికల విధుల డబ్బులు ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. అనంతరం స్థానిక విలేకరుల వద్ద వారి గోడు వినిపించారు. చీపురుపల్లి నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన రెవెన్యూ సిబ్బంది సుమారు రెండు నెలల పాటు సాధారణ ఎన్నికల్లో అధికారుల ఆదేశాల మేరకు విధులు నిర్వహించామన్నారు. చీపురుపల్లి మండలంలో పనిచేసిన వారికి రావాల్సిన ఎన్నికల రెమ్యునరేషన్ ఇంత వరకు ఒక్క పైసా కూడా ఇవ్వలేదని వాపోయారు. చీపురుపల్లి నుంచి ఆర్‌డిఒ కార్యాలయానికి, అక్కడి నుంచి గరివిడి ఎస్‌డిఎస్ కళాశాలకు, విజయనగరంలో ఓట్ల లెక్కింపు జరిగే లెండి కళాశాలలో కూడా క్షణం కూడా తీరిక లేకుండా రాత్రీ పగలూ విధులు నిర్వహించామన్నారు. అప్పటి నుంచి రవాణా ఖర్చులు కూడా తామే భరించామని వెల్లడించారు. ఎన్నికల విధులు నిర్వహించే సమయంలో కూడా తమకు సరైన భోజనాలు కూడా అందేవి కాదని వాపోయారు. పోలింగ్ రోజు ఏర్పాట్లు చేయడానికి మిగతా చోట్ల రూ.8 వేలు ఇస్తే, చీపురుపల్లి నియోజకవర్గంలో రూ.5 వేలు ఇచ్చి అధికారులు చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. దీంతో తాము అప్పులు చేసి టెంట్లు వేసిన వారికి ఇవ్వాల్సి వచ్చిందన్నారు. కష్టపడి పని చేశామని, తమకు రావాల్సిన డబ్బులు ఇప్పించాలని తహశీల్దార్‌ని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. 'ప్రస్తుతం బడ్జెట్ లేదు.. బడ్జెట్ వస్తే త్వరలో వచ్చే తహశీల్దారు మీ అదృష్టం బాగుంటే ఇస్తార'ంటూ తమని అవహేళనగా మాట్లాడుతున్నారని రెవెన్యూ సిబ్బంది వాపోయారు. ఇప్పటికైనా తమ ఆవేదనను అర్థం చేసుకుని, తమకు రావలసిన రెమ్యునరేషన్‌ని ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న రెవెన్యూ సిబ్బంది

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

- జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్
- ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్/కోట

యోగా సాధన ద్వారా చక్కని శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యాన్ని కూడా పొందవచ్చునని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ పేర్కొన్నారు. ప్రతీఒక్కరూ యోగా చేయవచ్చునని, ఎవరికీ ఎటువంటి పరిమితులు లేవని అన్నారు. అద్భుత ఫలితాలను ఇచ్చే యోగా ఇప్పుడు విశ్వవ్యాపితం అయ్యిందని చెప్పారు. ప్రతి ఒక్కరూ యోగాను అభ్యసించడం ద్వారా తమ ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవాలని కోరారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో శుక్రవారం ఘనంగా జరిగింది. 'స్వయం..సమాజం కోసం యోగా' అనే లక్ష్యంతో ఈ ఏడాది నిర్వహించిన యోగా డే కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జాయింట్ కలెక్టర్ కార్తీక్ హాజరయ్యారు. ఆయన స్వయంగా యోగాసనాలు వేయడమే కాకుండా, కార్యక్రమంలో పాల్గొన్న ప్రతీఒక్కరినీ అభినందించారు. యోగా గురువులు ఉషారాణి, శ్రీనివాస్, సదాశివ సుందరరావులను సత్కరించారు. తిరుమల మెడికవర్ ఆసుపత్రి సౌజన్యంతో ఆయుష్, జిల్లా క్రీడాభివద్ధి సంస్థ, సెట్విజ్, ఎన్‌వైకె శాఖల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిఎస్‌డిఒ వెంకటేశ్వరరావు, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ వరప్రసాద్, నేచురోపతి వైద్యులు డాక్టర్ చైతన్య స్వప్న, ఎన్‌వైకె ఎఒ పృథ్వీ, తిరుమల సూపరింటెండెంట్ డాక్టర్ షరీన్ పాల్గొన్నారు.

శారీరక, మానసిక రుగ్మతలను అధిగమించవచ్చు

జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీసు పరేడ్ గ్రౌండులో యోగాభ్యసనాలను చేపట్టి, అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్‌పి ఎం.దీపిక ముఖ్య అతిధిగా హాజరై, పోలీసు అధికారులు, సిబ్బందితో కలసి యోగా గురువు ఎం.దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో యోగా సాధన చేసారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ - శారీరక, మానసిక రుగ్మతలను యోగ ఆరోగ్యం సాధనతోనే అధిగమించవచ్చునన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతీ రోజూ 30 నిమషాలు సమయమైనా యోగ సాధన చెయ్యాలన్నారు. అనంతరం, యోగా శిక్షకులు ఎం. దుర్గా ప్రసాద్ పర్యవేక్షణలో డిఎస్‌పిలు, సిఐలు, ఆర్‌ఎస్‌ఐలు, పోలీసు అధికారులు, సిబ్బంది యోగ సాధన చేసారు. ఐసిడిఎస్, విద్యాశాఖ సంయుక్తంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో యోగా దినోత్సవం జరిగింది. విజయనగరం విటి అగ్రహారం జెడ్‌పి హైస్కూలులో యోగాడే జరిగింది. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ బి శాంతకుమారి, సిడిపిఒ జి.ప్రసన్న పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న ఎస్‌పి దీపిక, పోలీసు అధికారులు, సిబ్బంది



యోగాసనాలు వేస్తున్న జెసి కార్తీక్

యోగాతోనే ఆరోగ్యం

విజయనగరం కోట : యోగా తోనే ఆరోగ్యమని టిడిపి నాయకులు వేచలపు శ్రీనివాసరావు అన్నారు. విజయనగరం మండలంలోని రాకోడు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ప్రభుత్వ మోమియో వైద్యశాల, పిహెచ్ సి ఆధ్వర్యంలో యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురువు పాశి పైడితల్లి యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో ప్రభుత్వ హోమియో డాక్టర్ సత్యేంద్ర కుమార్, పిహెచ్‌సి డాక్టర్లు శ్రావణి, అఖిల, సిహెచ్ఒ మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

వాలంటీర్లకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

వార్డు, గ్రామ వాలంటీర్లను ప్రభుత్వం విధుల్లోకి తీసుకొని న్యాయం చేయాలని సిఐటియు జిల్లా కమిటి సభ్యులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో రాజీనామా చేసిన వాలంటీర్లను ప్రభుత్వం మానవతా దృక్పథంతో విధుల్లోకి తీసుకోవాలన్నారు. వాలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు నిరాటంకంగా అందేవని గుర్తుచేశారు. ఇటీవల పరిణామాల నేపథ్యంలో వారు విధులకు హాజరు కాలేని పరిస్థితుల్లో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల్లో వాలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని హామీనిచ్చిందని, ఇచ్చిన మాట ప్రకారం వాలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

అందరి సహకారంతో విజయవంతంగా ఎన్నికలు

ప్రజాశక్తి-బొబ్బిలి

అందరి సహకారంతో ఎన్నికలు విజయవంతంగా ముగిశాయని ఆర్‌డిఒ ఎ. సాయిశ్రీ అన్నారు. స్థానిక సూర్య రెసిడెన్సీలో ఎన్నికల విధులు నిర్వహించిన అధికారులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలు విజయవంతం చేసేందుకు అందరూ కష్టపడి పని చేశారన్నారు. ఈ సందర్భంగా అధికారులను అభినందించారు. ఇదే స్ఫూర్తితో ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పని చేయాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనాధరావు నాయుడు, రెవెన్యూ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రవేశాల కోసం ప్రచారం

ప్రజాశక్తి-గజపతినగరం

తమ పాఠశాలలో ప్రవేశాల శాతాన్ని పెంచేందుకు స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రమేష్ కుమార్ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. తమ పాఠశాలలో గత విద్యా సంవత్సరం సాధించిన పదో తరగతి ఫలితాలను శుక్రవారం ఆటో ద్వారా గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ ప్రచార రథాన్ని ఎంఇఒ ఎస్.విమలమ్మ, సాయి చక్రధర్ ప్రారంభించారు. విద్యార్థులతో ప్రచార రథం వెనుక భారీ ర్యాలీ చేపట్టి ప్రభుత్వ బడిలో నాణ్యమైన విద్య గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి-రామభద్రపురం

అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం సమృద్ధిగా అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఐసిడిఎస్ సిడిపిఒ రాజ్యలక్ష్మి తెలిపారు. స్థానిక పిహెచ్‌సిలో పోషణపై అంగన్వాడీలు, ఆశావర్కర్లు, ఎఎన్ఎంలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాలా సెంటర్లలో పౌష్టికాహారం లోపం వల్ల పిల్లల్లో ఎదుగుదల సమస్యలున్నాయని తెలిపారు. దీనిని నిరోధించడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు కృష్ణకుమారి, సూర్యకళ, అంగన్వాడీ కార్యకర్త లక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పార్వతీపురం రెండో అదనపు జిల్లా జడ్జి దామోదరరావు

29న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-బొబ్బిలి

ఈనెల 29న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని పార్వతీపురం రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు కోరారు. స్థానిక కోర్టులో శుక్రవారం న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టులో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించేందుకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్, జూనియర్ సివిల్ జడ్జి సరోజనమ్మ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.సౌమ్య జోసెఫిన్, న్యాయవాదులు పాల్గొన్నారు.



జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును ఆ శాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వై.ఆనందకుమార్ ఆధ్వర్యాన నాయకులు, ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.
- ప్రజాశక్తి, విజయనగరం

గంజాయితో జీవితాలు నాశనం


ప్రజాశక్తి-బొబ్బిలి

గంజాయితో జీవితాలు నాశనం అవుతాయని ఎస్ఐబి ఇన్‌స్పెక్టర్ బివి మురళీధర్ అన్నారు. గంజాయికి వ్యతిరేకంగా గొల్లవీధి జంక్షన్లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి అమ్మినా, వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి రవాణాపై నిఘా పెట్టామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జగ్గయ్యపేట ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ పి.బాల భాస్కర్‌రావు శుక్రవారం సందర్శించారు. తెలుగు, ఇంగ్లీషు పాఠ్యపుస్తకాలలో పాఠాలను విద్యార్థులతో చదివించారు. పాఠశాల ఆవరణను పరిశీలించారు. పాఠశాలలో మొక్కలను నాటాలని, పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు సులభతరంగా విద్యా బోధన చేయాలని ఉపాధ్యాయులకు తెలిపారు.



విద్యార్థులతో పాఠాలు చదివిస్తున్న ఎంఇఒ బాల భాస్కర్‌రావు

గురుకులంలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వేరకు మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఫ్లోరెన్స్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీలోగా విద్యార్థులు ఆధార్, స్టడీ సర్టిఫికెట్‌తో హాజరై దరఖాస్తులు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 27న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

యోగా.. శరీరానికి మంచిదేగా!






రేగిడి, బొబ్బిలి, వంగరలో యోగా డే ఆకారంలో విద్యార్థులు



చీపురుపల్లిలో యోగాసనాలు వేస్తున్న ఎస్ఐలు, సిబ్బంది

జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, విద్యాలయాల్లో యోగాసనాలు వేయించారు. యోగా ప్రాముఖ్యతపై గురువులు అవగాహన కల్పించారు. ఇందులో ప్రజాప్రతినిధులు అధికారులు, నాయకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు భాగస్వాములయ్యారు.



శృంగవరపుకోటలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు




గరివిడి మండలం కాపుశంభాం హైస్కూలు, వేపాడలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



యోగాసనాలు వేస్తున్న రాకోడు పిహెచ్‌సి సిబ్బంది



సీతం కళాశాలలో విద్యార్థులతో యోగాసనాలు వేయిస్తున్న గురువు




సెంచూరియన్ వర్సిటీలో యోగాసనాలు



రాజాం కోర్టు ఆవరణలో యోగాసనాలు వేస్తున్న జడ్జిలు, న్యాయవాదులు, సిబ్బంది




గంట్యాడ, తెర్లాంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



డెంకాడలో విద్యార్థులతో యోగాసనాలు వేయిస్తున్న గురువులు

నీరివ్వని ట్యాంకులు ఎందుకు?

చీపురుపల్లి మండల సమావేశంలో ప్రజాప్రతినిధుల ఆవేదన

ప్రజాశక్తి-చీపురుపల్లి



సమీక్షిస్తున్న ఎంపిపి వెంకట నర్సమ్మ, జెడ్‌పిటిసి శిరీషా

ప్రజలకు నీరందించని ఉత్తుత్తి ట్యాంకులు మాకెందుకు అంటూ మండలంలోని సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు మండల సమావేశంలో ఆవేదన వ్యక్తంచేశారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ డి.స్వాతి ఆధ్వర్యాన మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో శాఖల వారీగా ఎంపిపి ఇప్పిలి వెంకటనర్సమ్మ సమీక్షించారు. ఈ క్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ మాట్లాడుతుండగా సర్పంచులతోపాటు మరి కొంత మంది ప్రజాప్రతినిధులు గ్రామాల్లో తాగునీటి సమస్యపై నిలదీశారు. కరకాం పంచాయతీలో ట్యాంకులైతే కట్టారు గానీ ఏ ఒక్క ఇంటికీ తాగు నీరందించడం లేదని ఆ గ్రామ సర్పంచ్ జమ్ము సావిత్రి అధికారులను ప్రశ్నించారు. అన్ని పంచాయతీల్లోనూ ఇదే పరిస్థితి ఉందని కొంతమంది సర్పంచులు వంత పలికారు. దీంతో ఎంపిపి వెంకటనర్సమ్మ స్పందిస్తూ ప్రజలకు నీరందించేందుకు ట్యాంకులు నిర్మించారని, వారికి తాగునీరు ఎందుకు సక్రమంగా ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇలా కొనసాగితే మంచిది కాదని, త్వరలోనే ఆ సమస్య పరిష్కారం కావాలని సూచించారు. చీపురుపల్లి ఏరియా ఆస్పత్రిలో కూడా వైద్యం సరిగా అందడం లేదని కొంతమంది సర్పంచులు సమావేశంలో లేవనెత్తారు. చీపురుపల్లి ఆస్పత్రికి ఎవరినైనా రోగిని తీసుకెళ్తే విజయనగరం రిఫర్ చేస్తున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఏరియా ఆస్పత్రి వైద్యులని ఎందుకలా జరుగుతుందని ఎంపిపి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి వంద పడకలు స్థాయి అయినా, 30 పడకల వరకు మాత్రమే మౌలిక వసతులు ఉన్నాయని వారు తెలిపారు. సమావేశంలో జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీషా, వైస్ ఎంపిపి కరిమజ్జి వెంకట రమణమ్మ, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

తీర్మానాలు లేకుండానే ముగించేశారు

ప్రజాశక్తి-కొత్తవలస



సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో కొత్తవలస మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించినా ఎలాంటి తీర్మానాలూ లేకుండా ముగించేయడం గమనార్హం. ఖరీఫ్ సీజన్లో రైతులందరికీ వరి విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టామని హార్టికల్చర్ అధికారి పద్మజ తెలిపారు. ఆర్‌బికెల్లో వచ్చే సోమవారం నుంచి బుధవారం వరకు విత్తనాల అమ్మకాల కోసం సిద్ధం చేసినట్టు చెప్పారు. ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ ఆర్.సన్యాసినాయుడు మాట్లాడుతూ మండలంలో 24 గ్రామాలలో తాగునీరు సమస్య లేకుండా చేశామన్నారు. ఆరు వాటర్ ట్యాంకుల నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. ఇంటింటికీ తాగునీటి కొళాయికి నిధులు మంజూరై, టెండర్ల దశలో ఉన్నాయని తెలిపారు. అది కార్యరూపం దాలిస్తే గ్రామాలలో ప్రతి ఇంటికీ తాగునీరు ఇవ్వడం సాధ్యమవుతుందని చెప్పారు. తుమ్మికపల్లి సర్పంచ్ విరోధి కొండలరావు మాట్లాడుతూ ప్రయివేట్ పాఠశాలల్లో విద్యార్థులు ఫీజుల బకాయిలు లేకపోయినా తల్లిదండ్రులకు టిసిలు ఇవ్వడం లేదన్నారు. మరీ ముఖ్యంగా రవీంద్ర భారతి పాఠశాల యాజమాన్యం తీరు బాగోలేదని చెప్పారు. విద్యాశాఖ అధికారులు ప్రయివేట్ పాఠశాల వైఖరిపై దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, ఎంపిడిఒ ఎస్.రమణయ్య, తహశీల్దార్ చంద్రశేఖర్, వైస్ ఎంపిపిలు కర్రి శ్రీను, మేలాస్త్రి సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంగీత దినోత్సవం



కచేరీ చేస్తున్న కళాకారులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ 678వ కార్యక్రమం. రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యాన ప్రపంచ సంగీత దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. చి.జగన్నాథ్‌రాం గరికపాటి గాత్ర కచేరీ అందరినీ అలరించింది. పప్పు జ్ఞానదేవ్ వయోలిన్‌పై డాక్టర్ పత్రి సతీష్ కుమార్, మృదంగంపై, చి.శ్రీహరిణి తంబురాపై సహకరించారు. అనంతరం ప్రముఖ మృదంగ విద్వాంసులు, కేంద్ర సంగీత్ నాటక్ అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పత్రి సతీష్ కుమార్‌ను సత్కరించారు. ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ధవళ సర్వేశ్వర రావు, అకాడమీ అధ్యక్షులు డాక్టర్ డి.వి.శ్రీకాంత్, డిఎన్ఆర్.స్కూల్ అధ్యక్షులు ఉసిరికల చంద్రశేఖర్ రావు, సభ్యులు డాక్టర్ రాఘవరావు, మహేశ్వర రావు, ధన్వాడ సుధాకర్, సుబ్బారావు, డాక్టర్ కందాల పద్మప్రియ, డాక్టర్ శ్రీనగేష్ పోడూరి, పద్మా రవిశంకర్, ఖండవల్లి కష్ణమూర్తి, మోడెకుర్తి శ్రీనివాస్‌రావు, రొటేరియన్స్, సంగీభిమానులు, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు విశేషంగా పాల్గొన్నారు.

వరి విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బానాది, ఎన్‌కెఆర్‌పురం, వల్లంపూడి, ఆతవ గ్రామాల్లో శుక్రవారం రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, సర్పంచులు కర్రి యశోద, జి.దేవి, బి.రామునాయుడు, న్యాయవాది గొంప వెంకటరమణ, నాయకులు వెంకటరమణ, జగ్గు బాబు, ఉప సర్పంచ్ రుద్ర వెంకటరావు పాల్గొన్నారు.



వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న గొంప వెంకటరావు

విద్యుత్తు తీగలు చోరీ

చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని జోడుబంధాల సెంటర్ నుంచి తునివాడకు వెళ్లే 33 కెవి విద్యుత్ లైన్ స్తంభాలపై వైర్లను గురువారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. ఒక్కసారిగా విద్యుత్తు నిలుపుదల కావడంతో తునివాడ గ్రామస్తులు చోరీకి పాల్పడిన వ్యక్తిని పట్టుకున్నారు. పెద్ద కోడిశ గ్రామానికి చెందిన గేదెల రాముగా గుర్తించారు.. ఈ విషయాన్ని ఎఇ హరిబాబుకు తెలిపారు. తక్షణమే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆయన్ను అరెస్ట్ చేశారు. ఎఇ హరిబాబు ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. గత కొంతకాలంగా జోడుబందాల సెంటర్ నుండి ఉంగరాడ తహశీల్దార్ కార్యాలయం సమీపం వరకు రాత్రిపూట గ్రామాలలో విద్యుత్ స్తంభాల వైర్లను దొంగలిస్తూ విద్యుత్తు శాఖాధికారులకు కంటిమీద కునుకు లేకుండా చేసిన నిందితుడు దొరకడంతో ఆ శాఖ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. 50 వేల విలువచేసే రెండు క్వింటాళ్ల విద్యుత్ వైర్ లను నిందితుడి నుండి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గేదెల రాముతో పాటు మరికొంతమంది దొంగతనానికి పాల్పడి ఉంటారని పోలీసులు తెలిపారు..

'సిపా ప్లే ఉడ్'పై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్ కొవ్వాడ అగ్రహారం రైతుల ఫిర్యాదు

ప్రజాశక్తి-పూసపాటిరేగ



ఫిర్యాదు చేస్తున్న కొవ్వాడ అగ్రహారం రైతులు

వ్యర్థ జలాలను చెరువుల్లోకి విచ్చలవిడిగా వదిలేస్తున్న సిపా ప్లే ఉడ్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని కొవ్వాడ అగ్రహారం రైతులు శుక్రవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సిపా ప్లే ఉడ్ కంపెనీ నుంచి రసాయన వ్యర్థాలను తమ గ్రామంలోని చెరువులోకి వదిలేస్తున్నారని వారు తెలిపారు. ఆ చెరువు నుంచే తమ పొలాల సాగుకు, పశువుల తాగునీటికి నీరందుతుందని చెప్పారు. ఎటువంటి శుద్ధి చేయకుండా వ్యర్థ జలాలు వదిలేయడంపై పంటలు నాశనం అవుతాయని, పశువులు రోగాల బారిన పడతాయని ఆందోళనగా ఉందన్నారు. ఈ విషయమై పరిశ్రమ ప్రతినిధులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నార న్నారు. ఈ విషయమై కాలుష్య నియంత్రణ అధికారికి, తహశీల్దార్‌కు ఫిర్యాదుచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సామంతులు సోంబాబు, కోట్ల సత్యంనాయుడు, లెంక సురేష్, పతివాడ రాజినాయుడు తదితరులు ఉన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లిమర్ల



విపత్తులపై అవగాహన కల్పిస్తున్న ఎన్‌డిఆర్‌ఎఫ్, ఫైర్, స్కౌట్ అధికారులు

ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులపై ఎన్‌డిఆర్‌ఎఫ్, అగ్నిమాపక శాఖ అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. శుక్రవారం స్థానిక కెజిబివిలో రెవిన్యూ, పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో అన్ని పాఠశాలల విద్యార్థులకు సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎన్‌డిఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ సుశాంత్ కుమార్ బెహరా మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు, అగ్ని ప్రమాదాలు, భూకంపాలు, తుపాను, వరదలు సంభవించినప్పుడు ప్రమాద ఉధృతి పెరగకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాద పరిస్థితుల్లో ఉన్నవారిని రక్షించడానికి భయపడకుండా వారికి మనోధైర్యాన్నిచ్చి కాపాడాల్సిన బాధ్యత తీసుకోవాలని కోరారు. పాఠశాలల్లో భద్రత చర్యలు కట్టుదిట్టం చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫైర్ ఆఫీసర్ సంతోష్ కుమార్, ఇన్‌ఛార్జి డిఇఒ గౌరీశంకర్, డిప్యూటీ తహశీల్దారు డి.శైలజ, ఎంఇఒ యుఎస్ఎన్.మూర్తి, జిల్లా స్కౌట్ గైడ్ కమిషనర్ ఇ.విజయ్ కుమార్, కెజిబివి ఎస్ఒ బి.ఉమ పాల్గొన్నారు.

అనుమతుల్లేని కళాశాలపై చర్యలు తీసుకోవాలని ధర్నా

ప్రజాశక్తి-బొబ్బిలి



ఆర్‌డిఒకు వినతి అందిస్తున్న విద్యార్థి జెఎసి నాయకులు

అనుమతులు లేకుండా నడుపుతున్న శ్రీచైతన్య జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎపి విద్యార్థి జెఎసి ఆధ్వర్యాన శుక్రవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికిరణ్ యాదవ్ మాట్లాడుతూ శ్రీచైతన్య జూనియర్ కళాశాల భవన నిర్మాణంలో ఉంటుండగా 200 మంది పైగా విద్యార్థులతో తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఏదైనా ప్రమాదం జరిగితే అక్కడ ఉండే విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రాణహాని ఉంటుందని ఆందోళన వ్యక్తంచేశారు. వెంటనే సదరు కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కళాశాలలో పుస్తకాలు, యూనిఫాంను కళాశాల పేరు ముద్రించి విక్రయిస్తున్నారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం పెట్టిన ఫీజులు కన్నా అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఆర్ఐఒకు రెండు రోజుల క్రితం ఈ విషయాన్ని తెలియజేసినా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్, రాజేష్, మహేష్, కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

ప్రజాశక్తి-గంట్యాడ



మృతిచెందిన బాలుడు గణేష్

మండలంలోని గంట్యాడలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడు శీర గణేష్ (3) అక్కడికక్కడే మృతి చెందాడు. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. కొండగుంపాం గ్రామం నుంచి శీర శ్రీను, మౌనిక, బాలుడు గణేష్‌తో కలిసి బైక్‌పై వెళ్తున్నారు. శృంగవరపుకోట నుంచి విజయనగరం వైపు వస్తున్న కారు వీరిని ఎదురుగా ఢీకొంది. దీంతో బాలుడు గణేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీను, మౌనికతోపాటు కారు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో విజయనగరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శ్రీను పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో విశాఖపట్నంలోని కెజిహెచ్‌కు తరలించారు. విజయనగరం రూరల్ సిఐ శ్రీనివాసరావు, గంట్యాడ ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోనేరులో కాలు జారిపడి వ్యక్తి మృత్యువాత

ప్రజాశక్తి- వంగర

స్నానానికి వెళ్లి ప్రమాదవశాస్తు కాలు జారిపడి వ్యక్తి మతి చెందిన ఘటన మండలంలోని అరసాడలో శుక్రవారం జరిగింది. అరసాడ గ్రామానికి చెందిన దవరసింగి మహేష్ (33) గ్రామ శివాలయం వద్ద ఉన్న నారప్ప కోనేరు వద్దకు స్నానం చేసేందుకు శుక్రవారం వెళ్లాడు. ప్రమాద వశాత్తూ కాలుజారి కోనేరులో మునిగిపోవడంతో గమనించిన స్థానికులు మహేష్‌ను బయటకు తీసి రాజాంలో గల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మహేష్ మృతి చెందాడు. ఆయనకు భార్య కుమారి, కుమారుడు వాసు, కుమార్తె సునీత ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సుగుణాకర రావు తెలిపారు.